


	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	40	25
భద్రాద్రి	40	25



రంజాన్‌వేళలు

ఇఫ్తార్ (సా) : 6:28 (గురువారం)

సహర్ (ఉ) : 4:39 (శుక్రవారం)





నెత్తురోడుతున్న సరిహద్దు అడవులు

లోక్‌సభ ఎన్నికల వేళ యుద్ధ వాతావరణం

పార్లమెంట్ ఎన్నికల వేళ అడవుల్లో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. గత 20 రోజులుగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అడవుల్లో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లే ఇందుకు నిదర్శనం. మావోయిస్టులను పట్టుకునేందుకు తెలంగాణ సరిహద్దు అడవుల్లోకి బలగాలు చొచ్చుకుని వస్తున్నాయి. ఎన్‌కౌంటర్ ఘటనల నేపథ్యంలో భద్రాచలం నియోజకవర్గంలోని చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేస్తున్నారు.

- 20 రోజుల్లో 21 మంది మావోయిస్టు పార్టీ నక్సల్స్ హతం
- మృతుల్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ క్యాడర్ నాయకులు
- వరుస ఘటనలతో వణుకుతున్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అటవీ గ్రామాలు
- తెలంగాణ అడవుల్లోనూ కొనసాగుతున్న కూంబింగ్
- విస్తృతంగా తనిఖీలు... భయాందోళనల్లో జనం..

చర్ల/దుమ్ముగూడెం, ఏప్రిల్ 3: ఛత్తీసగఢ్ రాష్ట్రంలోని బస్తర్ డివిజన్‌లో ఉన్న 7 జిల్లాల్లో మావోయిస్టుల కదలికలు అధికంగా ఉండటంతో.. యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో భాగంగా పోలీసు బలగాలు నిరంతరం కూంబింగ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే బలగాలు, మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. గత 20 రోజుల వ్యవధిలో అటు మహారాష్ట్ర, ఇటు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో నాలుగు ఎన్‌కౌంటర్లు చోటు చేసుకోగా, సుమారు 21మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టులు ఉన్నారు. మరోవైపు ముఖ్య నాయకులను కోల్పోతుండటంతో మావోయిస్టులు కలవరపాటుకు గురవుతున్నారు. అడవిలో ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే మరో ఘటన జరుగుతుండడంతో వారు ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల వేళ

మరి కొద్ది రోజుల్లో తెలంగాణ, చత్తీస్ఘడ్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఇదే క్రమంలో మావోయిస్టులు ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిస్తూ వస్తున్నారు. దీంతో ఎన్నికలను సజావుగా నడిపించేందుకు పోలీసు బలగాలు అడవుల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు. బలగాలు చొచ్చుకు పోతుండడంతో అడవుల్లో ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. దీంతో అటవీగ్రామాల్లోని ఆదివాసీలు భయాందోళనలు చెందుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చత్తీస్గడ్ లోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో ఎన్నికల నిర్వహణ కొంత కష్టంగా మారే అవకాశం కనిపిస్తోంది. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న బీజాపూర్ జిల్లా బస్తర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉండగా, భద్రాచలం నియోజకవర్గం మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉంది.

తెలంగాణ సరిహద్దుల్లో...

వరుస ఘటనలతో తెలంగాణ పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఎన్‌కౌంటర్లలో తప్పించుకున్న మావోయిస్టులు తెలంగాణ సరిహద్దుల్లోకి వచ్చే అవకాశం ఉండడంతో భద్రాచలం నియోజకవర్గంలోని నాలుగు మండలాల అడవుల్లోకి పోలీసులు చేరుకుంటున్నారు. చత్తీస్గడ్ సరిహద్దులపై ఆనుకుని గాలింపు ముమ్మరం చేస్తున్నారు. అలాగే ఆయా మండలాల్లో సివిల్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. మండల కేంద్రాలకు వచ్చే వారి వివరాలను సేకరిస్తున్నారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేస్తున్నారు. చర్ల మండలంలో సీఐ రాజువర్మ, ఎస్సైలు టీవీఆర్‌సూరి, నర్సిరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు జరుతున్నాయి.

మావోయిస్టు బ్యానర్లు

దుమ్ముగూడెం: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండల సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మాజిల్లా గొల్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి రాయిగూడెం-తాళ్లగూడెం ప్రధాన రహదారిపై అడ్డంగా రెండుచోట్ల మావోయిస్టులు బ్యానర్లు కట్టారు. ఛత్తీస్‌గఢ్ వరస ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ బుధవారం బస్తర్‌బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. బూటకపు ఎన్‌కౌంటర్లను తిప్పికొట్టాలని, జరుగుతున్న ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలేనని అందులో పేర్కొన్నారు. బుధవారం జరగనున్న గొల్లపల్లి వారాంతపు సంతకు ఈనెల 2న సాయంత్రం చర్ల మండలానికి చెందిన వ్యాపారులు బయల్దేరగా, రాయిగూడెం దాటిన తర్వాత రోడ్డుకు అడ్డంగా మావోయిస్టు బ్యానర్లు కట్టి ఉండడంతో భయపడి వెనుతిరిగి రాయిగూడెంలో రాత్రి బసచేశారు. మిగతా వ్యాపారులతో కలిసి బుధవారం ఉదయం గొల్లపల్లి సంతకు వెళ్లి క్షేమంగా తిరిగివచ్చారు. ముందు జాగ్రత్తగా దుమ్ముగూడెం మండల సరిహద్దుల్లో నిర్మాణ పనుల్లో పాల్గొన్న యంత్రాలను సీఐ అశోక్ మైదాన ప్రాంతాలకు తరలించారు.

13కు చేరిన మృతుల సంఖ్య

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల సంఖ్య 13కు చేరింది. ఘటనా స్థలంలో మంగళవారం పది మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యం కాగా, బుధవారం ఉదయం మరో మూడు మృతదేహాలు కనిపించాయి. మృతుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను బీజాపూర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల అణచివేత కార్యాచరణలో భాగంగా సరిహద్దు మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తాం...

- నోటిఫికేషన్‌కు ముందుగానే నామినేషన్ పత్రాలు తీసుకోవచ్చు
- అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్
- ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదుకు అవకాశం
- 'ఖమ్మం' రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్
- ఎన్నికలు సజావుగా జరిగేలా భద్రతా ఏర్పాట్లు: సీపీ సునీల్‌దత్
- జిల్లా పరిషత్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. అభ్యర్థులకు నోటిఫికేషన్ ముందుగానే నామినేసన్ పత్రాలు అందుబాటులో ఉంచుతామని కావాల్సిన వారు తీసుకెళ్లి సరిచూసుకోవచ్చని తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో లోక్‌సభ ఎన్నికల మీడియా సెంటర్‌ను సీపీ సునీల్‌దత్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఈనెల 18న విడుదలవుతున్నప్పటికీ నామినేషన్ పత్రాలు ఈనెల 6నుంచే అందుబాటులో ఉంచుతామని, ఈ నామినేషన్ పత్రాలను పరిశీలించి నింపుకోవాలని తెలిపారు. ఇంటర్‌నెట్‌లో ఉండే నామినేషన్ పత్రాలు కొన్ని అప్‌డేట్ కాకుండా పాతవి ఉన్నాయని, అభ్యర్థులు సాధ్యమైనంత వరకు ఖమ్మం లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కార్యాలయం కలెక్టరేట్ నుంచే తీసుకోవాలని తెలిపారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ఒక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి నామినేషన్ పత్రాలు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. పోటీచేసే అభ్యర్థి దేశంలో ఎక్కడైనా ఓటరుగా నమోదై ఉండాలని, ప్రతిపాదించే వారు మాత్రం నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలన్నారు. అలాగే ఎన్నికల్లో పోటీచేయాలనుకునే అభ్యర్థులు, ఓటర్లు కూడా తమ ఓటును ఒకసారి చెక్ చేసుకోవాలని, ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవాలని తెలిపారు.

ఏప్రిల్ 15వరకు ఓటు కోసం, మార్పు కోసం దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉందని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 5న 52,987 ఎపిక్‌కార్డులు పంపిణీ చేశామని, 54,866 కార్డులు ప్రింటింగ్‌కు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ అనంతరం నామినేషన్ల స్వీకరణ కూడా ఉంటుందని కలెక్టర్ వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని, మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా అటాచ్ బాత్‌రూంలు ఏర్పాటు చేశామని వివరించారు. అలాగే ఎన్నికల విధుల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, ఇతర సిబ్బందికి ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు ఇచ్చి వారు విదులు నిర్వహించే పోలింగ్ కేంద్రంలోనే ఈవీఎంల ద్వారా ఓటు కల్పించబోతున్నామని తెలిపారు. ఇందుకోసం ఫారం 12 ద్వారా దరఖాస్తు చేయాలని, ఇప్పటికే ఎన్నికల ట్రైనింగ్‌కు వస్తున్న వారినుంచి ఈ ఫారాలు సేకరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఈవీఎంలున్నాయని, వాటి సాఫ్ట్‌వేర్‌ను కూడా పరీక్షించడం జరిగిందన్నారు.

ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ జిల్లాలో 12 ఇంటర్‌స్టేట్ చెక్‌పోస్టులు, 15 ఎస్ఎస్‌టీ, 15 ఎఫ్ఎస్‌టీ చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు ముమ్మరం చేశామని, ఇప్పటివరకు 54కేసులు నమోదు చేశామన్నారు. 359 లీటర్ల మద్యం, కిలో గంజాయి పట్టుకున్నామని, రూ.77లక్షల10వేల నగదు సీజ్ చేశామని, రూ.50వేల పైగా నగదుతో ప్రయాణిస్తే పట్టుకోవడం జరుగుతుందని, దానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు చూపించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మూడు కంపెనీల బలగాలు పాల్గొంటున్నాయని, 1, 2 ఫేజ్‌లో పాల్గొనే కేంద్ర బలగాలు జిల్లాకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మీడియా కేంద్రం ప్రారంభం

లోకసభ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. మీడియా సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా కేంద్రం ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీఆర్వో ఎం.ఏ. గౌస్, అదనపు పీఆర్వో వల్లోజి శ్రీనివాసరావు, పాత్రికేయులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిలు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 3: రానున్న లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లోని అసెంబ్లీ సెగ్మెంట్లకు కాంగ్రెస్ పర్యవేక్షకులను నియమించారు. ఈ మేరకు బుధవారం టీపీసీసీ నుంచి సర్క్యులర్ జారీ చేశారు. ఖమ్మం అసెంబ్లీకి కొత్త కొమ్ము శివకుమార్, లోకేష్‌యాదవ్‌లను నియమించగా, పాలేరుకు ఈవీ శ్రీనివాసరావు, మధిరకు రాపోలు జయప్రకాశ్, వైరాకు తోటకూరి రవిశంకర్, సత్తుపల్లికి బెల్లం శ్రీనివాసరావు, అనుగుల అర్జున్‌రావు, కొత్తగూడెంకు బత్తిని శ్రీనివాస్, బానోత్ బాలాజీ, అశ్వారావుపేటకు తుళ్లూరి బ్రహ్మయ్య, భద్రాచలానికి నెల్లపు దుర్గాప్రసాద్, జాస్త సత్యనారాయణ చౌదరి, ఇల్లెందుకు వన్నెం శ్రీకాంత్‌రెడ్డి, పినపాకకు మోతుకూరి ధర్మరావు, ధరావత్ రామ్మూర్తినాయక్, గురజాల గోపిని నియమిస్తూ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్‌కుమార్ జిల్లాలకు సమాచారం పంపారు.

తాగునీటిపై పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి



రెండు జిల్లాలకు సురేంద్రమోహన్ నియామకం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 3: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి పరిస్థితిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఐపీఎస్ అధికారులను నియమించింది. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తాగునీటి పరిస్థితిని పర్యవేక్షించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి కె.సురేంద్రమోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ప్రత్యేక అధికారి ఆయా జిల్లాల కలెక్టర్లతో రాష్ట్రస్థాయి విభాగాలతో సమన్వయం చేసుకుంటూ జూలై వరకు తాగునీటి పరిస్థితిపై పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రతిరోజూ అన్ని గ్రామాలకు, పట్టణాల్లో ప్రతి ఇంటికి తగినంత తాగునీటిని సరఫరా చేసేందుకు పర్యవేక్షణ అధికారులు తనిఖీలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల్లో తాగునీటి పరిస్థితికి సంబంధించిన పనులపై దృష్టి సారించాలని, ఆయా విభాగాల ఉద్యోగులకు, అధికారులకు సెలవులను మంజూరు చేసేది లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు.

బైక్‌పై బాలుడి విన్యాసాలు

- భయపెట్టినందుకు బాలుడిపైనా...
- బైక్ ఇచ్చినందుకు తండ్రిపైనా కేసు నమోదు

పాల్వంచ, ఏప్రిల్ 3 : జాతీయ రహదారిపై ఓ మైనర్ బాలుడు బైక్‌పై విన్యాసాలు చేసి పాదచారులను భయభ్రాంతులకు గురిచేశాడు. ఈ ఘటనపై పాల్వంచ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పట్టణ పరిధిలోని ఇందిరాకాలనీకి చెందిన బాలుడు (14)మధ్యాహ్నం తన బైక్‌పై దమ్మపేట సెంటర్‌కు చేరుకున్నాడు. అక్కడ పని పూర్తి చేసుకుని బైక్‌పై విన్యాసాలు చేస్తూ.. బైక్ ముందు చక్రం గాల్లోకి లేపుతూ పాదచారులను, తోటి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేశాడు. అలాగే బైక్‌పై ఫీట్లు చేస్తూ దమ్మపేట సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు చెలరేగి పోయాడు. అంబేద్కర్ సెంటర్‌లోని ట్రాఫిక్ పోలీసులు వారించినా పట్టించుకోలేదు. పోలీసులు బాలుడి ఆచూకీ గుర్తించిన తర్వాత, వాహనంపై వీరంగం వేసి, ఇతరులను భయభ్రాంతులకు గురి చేసినందుకు సదరు మైనర్‌పై, అతడికి బైక్ ఇచ్చినందుకు తండ్రి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ బాణాల రాము తెలిపారు.

ఆరు పరీక్షా కేంద్రాలు... 5296 మంది విద్యార్థులు

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు



ఖమ్మం ఖానాపురం హవేలి ఏప్రిల్ 3: దేశ వ్యాప్తంగా ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ మెయిన్స్ బీఆర్క్ రెండో విడత పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 4 నుంచి 9 వరకు జేఈఈ మెయిన్స్, 12న బీఆర్క్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఆర్.పార్వతీ రెడ్డి తెలిపారు. ఖమ్మంలో ఆరు పరీక్షా కేంద్రాలలో 5296 మంది విద్యార్థులు పరీక్షకు హజరుకానున్నారని తెలిపారు. 12న జరిగే బీఆర్క్ పరీక్షకు 884 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లలో ఉన్న సమయానికి గంటన్నర ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

అధిక వడ్డీ ఆశతో అసలుకే మోసం

ఇల్లెందులో మరో ఆన్‌లైన్ దగా వెలుగులోకి..

ఇల్లెందు, ఏప్రిల్ 3: అధిక వడ్డీలు వస్తాయన్న ఆశతో ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు పెట్టి నిండా మునిగిన మరో ఉదంతం భద్రాద్రి జిల్లా ఇల్లెందులో వెలుగు చూసింది. అధిక వడ్డీ ఆశతో ఆన్‌లైన్‌లో 'వీఐపీ వాలెట్' పేరుతో ఉన్న ఓ యాప్‌లో ఇల్లెందు పట్టణానికి చెందిన దీక్షిత్ అనే వ్యక్తితో పాటు మరికొంతమంది గత రెండు మూడేళ్లుగా పెట్టుబడులు పెట్టారు. వీరికి నూటికి రూ.3 వడ్డీ లభిస్తుండడంతో వీరిని చూసి ఇల్లెందులో అనేకమంది రూ.లక్షలు పెట్టారు. మొదట్లో కొద్ది నెలల పాటు సక్రమంగానే వడ్డీ చెల్లించడంతో అత్యాశకు పోయి కొంతమంది పెద్ద మొత్తాల్లో డబ్బు పెట్టారు. అయితే గత కొద్ది నెలలుగా వడ్డీ డబ్బు రాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు బుధవారం ఇల్లెందు పోలీసులను ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో ముందుగా తాను డబ్బు పెట్టి ఇతరులచే జమ చేయించిన దీక్షిత్‌ను విచారిస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

టెన్త్ 'స్పాట్' షురూ

- తొలిరోజు 800 మంది ఉపాధ్యాయుల హాజరు



ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 3: జిల్లాలో పదోతరగతి స్పాట్ వ్యాల్యూయేషన్ నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో బుధవారం ప్రారంభమైంది. ఈ స్పాట్ ఏప్రిల్ 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. స్పాట్ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నారు. స్పాట్‌కు హాజరుకానున్న ఉపాధ్యాయులకు మొబైల్ ఫోన్లు అనుమతి లేదు. ఒకవేళ తీసుకొచ్చినా.. గేటు వద్ద సెక్యూరిటీకి అప్పగించి రావాలి. కానీ ఉపాధ్యాయులు అందరూ మొబైల్ ఫోన్లతోనే స్పాట్‌కు హాజరయ్యారు. మొదటి రోజు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కారణంగా మొబైల్ ఫోన్లను అనుమతించామని, గురువారం నుంచి ఎవరూ మొబైల్ ఫోన్లు లోనికి తీసుకురావొద్దని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఈవో తెలిపారు. మొదటిరోజు రిజిస్ట్రేషన్ల అనంతరం మధ్యాహ్నం నుంచి ఉపాధ్యాయులకు పేపర్లు అందించారు. స్పాట్ వాల్యూయేషన్‌లో మొత్తం 2 లక్షల 10వేల 480 పేపర్లు దిద్దనున్నారు. కాగా మొదటి రోజు 800 మంది ఉపాధ్యాయులు స్పాట్‌కు హాజరుకాగా ఒక్కొక్కరు వివిధ సబ్జెక్టులకు సంబంధించి 20 పేపర్లు దిద్దినట్లు అధికారులు తెలిపారు. గురువారం నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పూర్తిస్థాయి వ్యాల్యూయేషన్ నిర్వహించనున్నారు.

162 మంది ఉపాధ్యాయులకు నోటీసులు

పదోతరగతి స్పాట్‌కు కేటాయించిన స్పెషల్ అసిస్టెంట్లు 162మంది స్పాట్ కేంద్రాలకు హాజరుకాకపోవడంతో డీఈవో సోమశేఖరశర్మ బుధవారం నోటీసులు జారీచేశారు. ఖమ్మం రూరల్ మండలంలో 13 మంది, తిరుమలాయపాలెంలో 14, ముదిగొండలో 18, ఖమ్మం అర్బన్‌లో 22, రఘునాథపాలెంలో 21, వైరాలో 2, కామేపల్లిలో 5, చింతకానిలో 5, కొణిజర్లలో 17, కూసుమంచిలో 12, నేలకొండపల్లిలో 16, సింగరేణిలో 8, ఏన్కూర్‌లో 2, బోనకల్‌లో 2, మొత్తం 162 మంది ఉపాధ్యాయులకు నోటీసులు జారీచేశారు.



ఏజెన్సీ పల్లెల్లో 'టీఎస్ ఈ-పాస్' కష్టాలు

- రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉంటేనే ఇళ్ల నిర్మాణానికి అనుమతి
- ఇంటి పన్ను నిర్ధారణ, క్రయ విక్రయాలకూ అవకాశం లేదు
- భద్రాద్రి జిల్లాలో రెండేళ్లుగా నిలిచిన కార్యకలాపాలు

7



వేసవి పంట.. ఆదాయం ఇంట

- తునికాకు సేకరణకు కార్యాచరణ పూర్తి
- వచ్చే నెల 1నుంచి తెంపుడు షురూ
- భద్రాద్రి సర్కిల్ లక్ష్యం 60,400 స్టాండర్డ్ బ్యాగులు

6



కల్లూరులో దివ్యాంగుడికి ఫిత్రాదానం చేస్తున్న ముస్లిం కుటుంబం

ఫిత్రా దానం.. జరూర్

పవిత్ర రంజాన్ మాసంలో ఆచరించే అనేక సత్కార్యాల్లో ఫిత్రా ఒకటి. ఉపవాస దీక్షలు పాటించేటప్పుడు జరిగిన పొరపాట్లకు పరిహారం రమజాన్ నెలలో విధిగా చెల్లించవలిసిన దానం అన్నమాట. ఫిత్రాల వల్ల పేదలకు కాస్తంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. కుటుంబంలో ఎంత మంది ఉంటే వారందరి తరుపున కుటుంబ యాజమాని ఫిత్రా చెల్లించాలి. మూడు, నాలుగు రోజుల ముందు చెల్లిస్తే పేదలు పండుగ సామగ్రి కొనుక్కోవడానికి వీలుగా ఉంటుంది. పండుగ సంతోషంలో అందరిని భాగస్వాములను చేయడమే ఫిత్రా అసలు లక్ష్యం.

-కల్లూరు

రిజిస్ట్రేషన్లు ఇలా చేస్తారా..

» జిల్లా కార్యాలయాన్ని సందర్శించిన శిక్షణ కలెక్టర్లు



రికార్డులను పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్లు

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 3: శిక్షణ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్ బుధవారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఒకరోజు శిక్షణలో భాగంగా కార్యాలయానికి వెళ్లారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు ఏ విధంగా చేస్తారనే అంశాన్ని జాయింట్ రిజిస్ట్రార్ పద్మను, ఆడిటింగ్ అధికారి రవీంద్రబాబును అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్లు చేసే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం జిల్లా రిజిస్ట్రార్, జాయింట్ రిజిస్ట్రార్ల విధులను అడిగి తెలుసుకున్నారు.

ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ

పెనుబల్లి, ఏప్రిల్ 3: మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలించి రికార్డుల ప్రకారం ఉన్న నిల్వలను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను ఆన్‌లైన్‌లోన నమోదు విధానాన్ని పరిశీలించారు. ఈ తనిఖీలఅధికారులు చాయారాజు, ప్రసాదరాజు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లొద్దన్నారని బాలిక ఆత్మహత్య



శ్రీవల్లి(ఫైల్)

టేకులపల్లి, ఏప్రిల్ 3: పెళ్లికి వెళ్లొద్దన్నారని మనస్తాపానికి గురై ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. టేకులపల్లి మండలం బోడు గ్రామంలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబధించిన వివరాలిలా ఉన్నాయి. బోడు గ్రామానికి చెందిన కల్తి చంద్రశేఖర్, నిర్మల దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అయితే రెండో కూతురైన కల్తి శ్రీవల్లి(16) మంగళవారం గ్రామంలో తమ బంధువుల వివాహానికి వెళతానని తల్లిదండ్రులను అడిగింది. కానీ ఆ పెళ్లికి వెళ్లేందుకు వారు నిరాకరించారు. దాంతో మనస్తాపానికి గురైన శ్రీవల్లి ఇంట్లో ఎవ్వరులేని సమయంలో పురుగులమందు తాగింది. తరువాత కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించి వెంటనే కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. శ్రీవల్లి భద్రాచలం గురుకుల కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. పరీక్షలు పూర్తికావడంతో ఇటీవలే ఇంటికి వచ్చింది. మృతురాలి తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు బోడు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

వేసవి పంట.. ఆదాయం ఇంట



ఆకుల కట్టలను కల్లంలో ఆరబెడుతున్న గిరిజనులు(ఫైల్)

ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రకృతి సంపద తునికాకు సేకరణకు రంగం సిద్ధమవుతోంది. ప్రతీ వేసవిలో లక్షలాది మందికి నెలరోజుల పాటు ఆదాయ వనరుగా తునికాకు సేకరణ ఉంది. గిరిజనులు తునికాకు సేకరణను వేసవి పంటగా భావిస్తుంటారు. ఆదివాసీ గ్రామాల్లో ప్రజలు వేసవిలో తునికాకు సేకరణలో నిమగ్నవుతుంటారు. రాష్ట్రంలో అటవీశాఖ ద్వారా చేపట్టే ఈ కార్యక్రమానికి తొలి అడుగుగా కొమ్మకొట్టుడు (ప్రూనింగ్) జరుగుతోంది. కాగా అంతరిస్తున్న అడవులు, తునికాకు సేకరణపై తగ్గుతున్న ఆసక్తితో ఏటికేడు తునికాకు సేకరణ లక్ష్యం పూర్తికావడం లేదు.

» తునికి ఆకు సేకరణకు కార్యాచరణ పూర్తి
» వచ్చేనెల 1నుంచి తెంపుడు ప్రారంభం
» భద్రాద్రి సర్కిల్ లక్ష్యం 60,400స్టాండర్డ్ బ్యాగులు
» అడవుల్లో కొనసాగుతున్న 'కొమ్మకొట్టుడు'

కొత్తగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రాష్ట్రంలోని 7సర్కిళ్లలో 194 యూనిట్లు, 2,173 కల్లాలు ఏర్పాటు చేసి 2,12,700 స్టాండర్డ్ బ్యాగులు సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం ఎంచుకొంది. యేటా వ్యవసాయ పనులు పూర్తియిన తర్వాత మే1 నుంచి 31వ తేదీ వరకు ఆకును సేకరిస్తారు. నెల రోజుల పాటు చేతి నిండా పని లభిస్తుంది. ఎండలు అధికంగా ఉండే రోజులు కాబట్టి వేకువజామునే అడవి బాట పడతారు. ఉదయం 9గంటల వరకు ఆకు సేకరించి, ఇంటికి చేరుకొని ఆకును 50ఆకుల కట్టలుగా కట్టుతారు. అలా కట్టిన కట్టలను సాయంత్రం నిర్దేశించిన కల్లాల వద్దకు వెళ్లి కాంట్రాక్టర్లకు విక్రయిస్తుంటారు. ప్రభుత్వం ఒక్కొక్క కట్టకు రూ.3ధర నిర్ణయించింది. దీంతో ఎలాంటి పెట్టుబడి లేకుండా ప్రకృతి సంపదను ఆదాయంగా మలుచుకొంటారు.



ధర పెంచినా సన్నగిల్లిన ఆసక్తి..

గిరిజనుల నుంచి సేకరించిన తునికాకును ఎండలో పదిరోజుల పాటు ఎండబెట్టి బస్తాల్లో నింపి బీడీల తయారీకి విక్రయిసుంటారు. నేల రోజుల్లోనే అటవీ ప్రాంతాల్లో రూ.వేల కోట్ల విలువైన వ్యాపారం జరుగుతుంది. దీంతో గిరిజనులకు పనిలేని రోజుల్లో పనికల్పించి ఆదాయం కల్పించడంతోపాటు, ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తుంది. అయితే ప్రభుత్వం ధర పెంచినా ఆకు సేకరణపై గిరిజనుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. దాంతో ఆకు సేకరణ లక్ష్యం పూర్తికావడం లేదు. గతంలో విపరీతమైన అటవీ ప్రాంతం ఉండటం వల్ల తునికాకు పెద్ద మొత్తంలో దొరికేది. ప్రస్తుతం అడవులు అంతరించి పోయి పోడు వ్యవసాయం అధికమైంది. సాగునీటి వనరులు పెరిగి వివిధ రకాల పంటల సాగులో గిరిజనులు నిమగ్నమయ్యారు. గతంలో ఆకు ఎక్కువగా దొరికినా గిట్టుబాటు ఉండేదికాదు. ప్రస్తుతం ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించినా తునికాకు లభించకపోవడంతో గిరిజనులు ఆకుసేకరణపై ఆసక్తి చూపడంలేదు.

లక్ష్యం దరిచేరని సేకరణ

ఏటికేడు తునికాకు సేకరణ లక్ష్యం తగ్గుతోంది. భద్రాద్రి జిల్లాలోని ఆరు డివిజన్‌లో గత నాలుగు సంవత్సరాల తునికాకు సేకరణ ఆ విషయాన్ని లెక్కలు దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. 2020లో జిల్లాలోని 6డివిజన్‌లో 35,700 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యంగా నిర్ధారిస్తే 30,3,258 స్టాండర్డ్‌బ్యాగులు(84.91శాతం), 2021 సీజన్‌లో 38,500 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం కాగా 32,234(83.73శాతం), 2022 సీజన్‌లో 35,100 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం కాగా 24,520 (69.86శాతం), 2023సీజన్‌లో 35,100 స్టాండర్డు బ్యాగుల లక్ష్యం కాగా 20,608 (58.71శాతం) స్టాండర్డు బ్యాగుల సేకరణ మాత్రమే జరిగింది.

భద్రాద్రి సర్కిల్‌లో 54యూనిట్లు..

రాష్ట్రంలో ఏడు సర్కిళ్లలో తునికాకు సేకరిస్తున్నారు. భద్రాద్రి సర్కిల్‌లో 54 యూనిట్ల ద్వారా 60,400 స్టాండర్డు బ్యాగుల సేకరణ లక్ష్యంగా ఈ ఏడాది నిర్ణయించారు. భద్రాచలం డివిజన్‌లో 5యూనిట్లు, మణుగూరు డివిజన్‌లో5 యూనిట్లు ఏర్పాటు చేశారు. పాల్వంచ డివిజన్‌లో4 యూనిట్లు, కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ డివిజన్‌లో 5యూనిట్లు, కొత్తగూడెం డివిజన్‌లో 4యూనిట్లు, ఇల్లెందు డివిజన్‌లో 8యూనిట్లు గుర్తించారు. మహబూబాబాద్ డివిజన్‌లో 5యూనిట్లు, గూడూరు వన్యప్రాణి డివిజన్‌లో10 యూనిట్లు, ఖమ్మం డివిజన్‌లో 2 యూనిట్లు, సత్తుపల్లి డివిజన్‌లో 3 యూనిట్లు, వరంగల్ డివిజన్‌లో 3 యూనిట్లు ఏర్పాటు చేసి తునికాకు కోసం ప్రూనింగ్ చేస్తున్నారు.

మండే కాలం.. జర జాగ్రత్త

» రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
» ఆసుపత్రులకు వడదెబ్బ బాధితులు
» జాగ్రత్తలు తీసుకోకుంటే డీహైడ్రేషన్ తప్పదు
» సకాలంలో చికిత్స అందకుంటే ప్రాణాపాయమే



వివిధ రూపాల్లో..

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 3: వేసవి సూరీడు క్రమంగా ప్రతాపాన్ని చూపుతున్నాడు. జిల్లాలో రోజురోజుకూ అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉపాధి కూలీలు, మహిళలు, వృద్ధులు, పిల్లలు ఎండ వేడి తాళలేక అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంది. జిల్లా జనరల్ ఆసుపత్రికి నిత్యం ఐదు నుంచి పది మంది పిల్లలు ఎండ బారినపడి చికిత్స కోసం వస్తున్నారు.

జాగ్రత్తలే కీలకం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో 43సెల్సియస్ డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత మార్కు దాటింది. వచ్చే రోజుల్లో అగ్నిగుండంలా మారుతాడని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత మొదలవుతోంది. మరో వైపు వేసవి సెలవులకు పాఠశాలలు సన్నద్ధం అవుతున్నాయి. జాగ్రత్తలు పాటించకుంటే వడదెబ్బ, ఇతర రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో ప్రయాణాలకు దూరంగా ఉండటం ఉత్తమం. పిల్లలను ఎండలో తిరగనీయొద్దు. తగిన మోతాదులో నీళ్లు లేదా అన్నం గంజి, సాబ్దాన్ బియ్యం, ఇతర ద్రావణాలు తీసుకోవాలి. చిన్న పిల్లలకు రోజుకు రెండు పూటలా స్నానం చేయించాలి.

ప్రయాణాలు వద్దు...
డాక్టర్ యాలమూడి గౌతమ్



వేసవిలో చిన్నారులతో ప్రయాణాలు చేయకుండా వాయిదా వేయడమే శ్రేయస్కరం. పిల్లలను ఎండలో తిరగనీయకుండా జాగ్రత్త పడాలి. ప్రతి గంటకు నీళ్లు పట్టించాలి. చంటి పిల్లలకు తల్లిపాలు పట్టిస్తుండాలి. తెల్లని వస్త్రాలు ధరిస్తే ఎండ నుంచి ఉపశమనం పొందవచ్చు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. వడదెబ్బ తగిలినట్లు అనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

ఈ సీజన్లో నవజాత శిశువులు డీహైడ్రేషన్‌తో కూడిన జ్వరాల బారిన పడతారు. ఏడాదిలోపు వయసున్న శిశువులకు రెండు గంటలకోసారి తల్లిపాలు పట్టించాలి. ఏడాది వయసు దాటిన వారిపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కలుషిత నీటిని తీసుకుంటే మరింత ప్రమాదకరం, నీటిని తక్కువగా తీసుకోవడంతో మూత్రనాళ, మూత్రకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం లేకపోలేదు.

ఇలా చేయాల్సిందే..

- బయటకు వెళితే గొడుగు, టోప్ తప్పనిసరి.
- నీరు కలిగిన కాయగూరలు తీసుకోవాలి.
- మిట్టమధ్యాహ్నం ఎండలోకి వెళ్లవద్దు.
- జావ, పుచ్చకాయ పండ్లు తీసుకోవాలి.
- నీటితో పాటు మజ్జిగ తాగాలి.
- జంక్‌ఫుడ్ తగ్గించాలి.
- కాటన్ దుస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

అభివృద్ధి చేసే వారికే అవకాశం ఇవ్వండి

» కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్

మణుగూరు, ఏప్రిల్ 3: పార్లమెంట్ ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికే అవకాశాన్ని ఇవ్వండని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ కోరారు. బుధవారం మణుగూరులో జరిగిన పినపాక నియోజకవర్గ ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కేంద్రంలో ఈ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి కోసం గుండాల ప్రాంతంలో బొగ్గు గని ఏర్పాటు, ఐటీసీ విస్తరణ, రైతుల కోసం పులుసుబొంత ప్రాజెక్టుతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేయబోతున్నామని అన్నారు. భవిష్యత్ లో కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పినపాక ఎమ్మెల్యేతో సమన్వయమవుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాననన్నారు. జరగబోయే ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పినపాక ఎమ్మెల్యే పాయం, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాషాయజెండా ఎగరడం ఖాయం

» బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు



ఎన్నికల కార్యాలయం వినోద్‌రావు పూజలు

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 3: పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ భారీ మెజార్టీతో గెలిచి ఖమ్మం ఖిల్లాపై కాషాయజెండా ఎగురడం ఖాయమని ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు జోస్యం చెప్పారు. బుధవారం పాల్వంచ దమ్మపేట సెంటరులో పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్ సెగ్మెంట్ సమగ్ర అభివృద్ధికి చక్కటి మ్యానిఫెస్టో రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రభారి శ్రీకాంత్, పార్లమెంట్ కన్వీనర్ ఎన్. రామలింగేశ్వరరావు, శ్రీనివాసరావు, మాధవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీపీ ఆధ్వర్యంలో పశువుల సంత

కామేపల్లి, ఏప్రిల్ 3: పండితాపురం శ్రీకృష్ణ ప్రసాద్ పశువుల నిర్వహణ బాధ్యతలను కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీకి అప్పగించారు. అందులో భాగంగా బుధవారం సంతను స్పెసల్ ఆఫీసర్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ నిర్వహించారు. సంతలో శాల్తీల నగదును వసూలు చేయడానికి పంచాయతీ కార్యదర్శులను, మల్టీపర్పస్ వర్కర్లను, ప్రైవేటు వర్కర్లను ఉపయోగించుకున్నారు. వారంతపు సంత ఆదాయం సుమారు రూ.5లక్షల వరకు వచ్చిందని సమాచారం. సంతను జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, డీఎల్పీవో కిర్తి ప్రభాకర్ ఏర్పాట్లను పరిశీలించారు.

అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈవీఎంల కేటాయింపు

» ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక
» భారీ భద్రత మధ్య స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలింపు
» కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 3: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈవీఎంల కేటాయింపు పూర్తి చేసినట్టు ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి సెగ్మెంట్లకు సంబంధించిన 1459 పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా పూర్తి పారదర్శకంగా ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రకారం ఈవీఎంలు వేరుచేసి, భద్రత నడుమ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారంతో సంబంధిత స్ట్రాంగ్ రూంలకు తరలించనున్నట్టు తెలిపారు.

ఖమ్మం, పాలేరు సెగ్మెంట్లకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో, వైరా సెగ్మెంట్‌కు సంబంధించి వైరాలోని సాంఘిక సంక్షేమ బాలిక రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో, సత్తుపల్లి సెగ్మెంట్‌కు సంబంధించి జ్యోతినిలయం హైస్కూల్‌లో, మధిర సెగ్మెంట్‌కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూంలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. శిక్షణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు 146 ఈవీఎంలను కేటాయించామన్నారు.

ఈనెల 18న నోటిఫికేషన్ వెలువడనున్నట్లు, 25వరకు నామినేషన్ల స్వీకరణ, 26న స్క్రూటిని, చేపట్టనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 8 నుంచి హెల్ప్‌డెస్క్ ప్రారంభించి, నామినేషన్ల ఫారాలు అందజేస్తా మని, నామినేషన్ల దాఖలుకు ఈసీఐ నుంచి వచ్చిన ప్రింటెడ్ ఫారాలు అందజేస్తామన్నారు. పోటీచేసే అభ్యర్థులు, దేశంలో ఎక్కడైనా ఓటుహక్కు కలిగివుండాలని, ప్రతిపాదికులు మాత్రం ఆయా నియోజకవర్గంలో ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. ముందుగా ఓటు ఉందో, లేదో తనిఖీ చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఓటు నమోదుకు ఏప్రిల్ 15న చివరి గడువు ఉన్నప్పటికీ, లేనివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతికి 48గంటల ముందు దరఖాస్తు చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్


హెల్ప్‌లైన్, సీ-విజిల్‌పై ప్రచారం

ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం తుది ఎలక్టోరల్ పబ్లికేషన్ చేపట్టనున్నట్టు తెలిపారు. ఫైనల్ పబ్లికేషన్ రాగానే కాపీ అందజేస్తామన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్, సీ-విజిల్ యాప్‌లకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎపిక్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల విధుల సిబ్బందికి ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు, దీనిపై ఏజెంట్లకు అవగాహన కల్పించాలన్నారు. 85సంవత్సరాలు పైబడినవారు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. సీ విజిల్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని, స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు అన్ని పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, జడ్పీ సీఈవో వినోద్, డీఆర్డీవో సన్యాసయ్య, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, రాంబాబు, వివిధ పార్టీల ప్రతినిధులు స్వర్ణ సుబ్బారావు, చెరుకుపల్లి నాగేశ్వరరావు, జీఎస్ ఆర్‌వి.విద్యాసాగర్, ఆర్.ప్రకాశ్, ఏ.గోపాల్‌రావు, చీకటి రాంబాబు, పాలడుగు టీఆర్. కృష్ణప్రసాద్, కొండబాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంచలనం సృష్టించిన కేటీపీఎస్ స్క్రాప్ స్కామ్

» జెన్కోలో చర్చనీయాంశమైన తుక్కు తరలింపు
» టెండర్‌పై ఆరా తీస్తున్న సీఎండీ రిజ్వీ



కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 3: పాల్వంచ కేటీపీఎస్‌లో స్క్రాప్ గోల్‌మాల్ వ్యవహారంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రూ100కోట్లు హంఫట్, తుక్కు పేరుతో తినేశారు' అనే కథనం రాష్ట్రంలోని జెన్‌కో కర్మాగారాల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేటీపీఎస్ తన పాతప్లాంటను మూసివేసి తుక్కు పేరుతో విక్రయించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2022లో టెండర్‌లు పిలిస్తే ముంబాయ్‌కి చెందిన హెచ్‌ఆర్ కంపెనీ రూ.485కోట్లకు టెండర్ పొందింది. దాంతో 2023 ఫిబ్రవరిలో తుక్కును తరలించేందుకు శ్రీకారం చుట్టారు. అయితే ఈ తరలింపులో నిబంధనలు ఉల్లంఘించి తుక్కును తరలిస్తుండడంతో ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో జెన్కో వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్‌తో జెన్‌కో సీఎండీ రిజ్వీ కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారం కూల్చివేతకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఎంత తుక్కు తరలించారు..? నిబంధనలు ఏమిటి..? అని ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కాగా కార్మిక సంఘాలు, ఇంజనీరింగ్ సంఘాలు, అధికారులు ఈ అంశంపైనే చర్చిస్తున్నారు. కేటీపీఎస్ ఓఅండ్‌ఎం సీఈ వెంకటేశ్వరరావు సైతం ఈ విషయంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉదయం వరకు తుక్కును ట్రాన్స్‌పోర్టు చేసిన కాంట్రాక్టర్ మధ్యాహ్నం నుంచి ట్రాన్స్‌పోర్టు నిలిపి వేశారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఎలాక్ట్రానిక్ మీడియాలో డిబేట్లు నిర్వహించడం గమనార్హం.



అమ్మవారిని దర్శించుకున్న మల్లు నందిని

భద్రకాళి సన్నిధిలో మల్లు నందిని

» అమ్మవారిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి సతీమణి

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 3: వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి అమ్మవారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మల్లు నందిని తొలుత ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీటీ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న డీవైఎస్‌వో

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 3: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం జిల్లాస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు ముగిశాయి. పోటీల అనంతరం విజేతలకు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, ఓలేటి సాంబమూర్తి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎంజీవి ప్రవీణ్, క్రిష్ణ సుమంత్, జంగా కార్తిక్, సంఘ సభ్యులు కామేశ్వరి, పరిటాల చలపతి, జాజి చాకో, అనుమోలు శృతి, అన్నెం రాజేష్, రెడ్డిసాయి శివ, జవహర్‌పాషా, ఉపేందర్, భవ్యచందు, తదితరులు ఉన్నారు.

జిల్లా ఆస్పత్రిలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

» ఎంపిక నలుగురు అధికారులతో కమిటీ
» కేవలం ముగ్గురు అభ్యర్థులే హాజరు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 3: ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుసంధానంగా ఉన్న జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను భర్తీ చేసేందుకు బుధవారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా ఎంపిక కమిటీ సభ్యులు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మాలతి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, కలెక్టరేట్ ఏవో ఎన్. అరుణ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ప్రొఫెసర్ పోస్టులు-6, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు-13, అసిస్టెంట్ ప్రొఫెసర్-6, సీనియర్ రెసిడెంట్ పోస్టులు-18 ఖాళీగా ఉండగా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిన ఎంపికచేయనున్నట్లు మార్చి 30న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే బుధవారం నాటి ఇంటర్వ్యూలకు కేవలం నలుగురు మాత్రమే అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. వీరిలో కేవలం ఒక్కరు మాత్రమే ఉద్యోగానికి అర్హత సాధించినట్లు తెలిసింది. మిగిలిన ముగ్గురు డిప్లొమా విద్యార్హత కలిగినవారని తెలిపారు. డీఎంఈ నిబంధనల ప్రకారం పీజీ ఉండాలని, డిప్లొమా అభ్యర్థులకు ఉద్యోగాల అర్హత లేదని తిరస్కరించినట్లు తెలిసింది. అయితే వీటిపై మరో మారు డీఎంఈకి కొత్త కాలేజీలో ట్యూటర్ల నియామకానికి డిప్లొమా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తే బావుంటుందన్న పలువురి సూచనను అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు.

‘అభ్యర్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి’



అభ్యర్థులతో మాట్లాడుతున్న కస్తాల సత్యనారాయణ

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 3: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ అన్నారు. బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఎస్సీ నిరుద్యోగులకు రెండు నెలల ఉచిత డిఎస్సీ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిక్షణలో విద్యార్థులకు ఉచితంగా భోజన, నివాస, స్టడీ మెటిరియల్‌ను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఖమ్మం ఎస్సీ స్టడి సర్కిల్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 996 మందికి ఉచిత శిక్షణ ఇవ్వగా, వారిలో 138 మంది పలు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. డిఎస్సీ కోచింగ్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. స్టడి సర్కిల్ పర్యవేక్షకులు వీరభద్రం, హనుమంతరావు, ఆర్‌వీఆర్ ప్రసాద్, సముద్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ కలపను వినియోగిస్తే చర్యలు



ఇటుకబట్టీల వద్ద అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న రేంజర్ రమేష్

అశ్వాపురం, ఏప్రిల్ 3: అనుమతులు లేకుండా ఇటుక బట్టీలల్లో అటవీ కలపను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్.రమేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గొందిగూడెం, సీతారాంపురం, గొల్లగూడెం, బిజికొత్తూరు, తుమ్మలచెరువు గ్రామాల పరిధిలో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలలో బుధవారం అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు జరిపారు. బట్టీలకు ఉపయోగిస్తున్న కలప, బొగ్గుకు సంబంధించి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా రేంజర్ మాట్లాడుతూ అనుమతులతో ఇటుక బట్టీలకు అటవీ కలపను వినియోగించాలని సూచించారు. అదేవిధంగా నిత్యం బట్టీలలో తనిఖీలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో డిఆర్వో శంకర్, ఎఫ్‌బీవో వీరబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తి లారీకి తప్పిన అగ్నిప్రమాదం

ఆళ్లపల్లి, ఏప్రిల్ 3: ఆళ్లపల్లి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కాటన్ మిల్లుకు వెళ్తున్న లారీ మండల పరిధిలోని రాయిపాడు గ్రామం వద్ద విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో మంటలు వచ్చినప్పటికి, విద్యుత్ వైర్లు రెండు ముక్కలుగా తెగిపోవడంతో పత్తి లారీకి పెను ప్రమాదం తప్పింది.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

మణుగూరు, ఏప్రిల్3: మణుగూరు పట్టణంలో ఫోన్లు పోగొట్టుకున్న 12మంది బాధితులకు పోలీసులు వారి ఫోన్లను వెతికి పట్టుకొని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మణుగూరు సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఫోన్లు పొగొట్టుకున్న వారు వెంటనే మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఆ ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోను ఎక్కడ ఉందన్న సమాచారం తెలుస్తుందన్నారు. ఫోన్లను కనిపెట్టడంలో సేవలందించిన కానిస్టేబుళ్లు వెంకట్, బుచ్చిబాబులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.



బాధితులకు ఫోన్లను అందజేస్తున్న సీఐ సతీష్‌కుమార్

ఏజెన్సీ పల్లెల్లో

‘టీఎస్ ఈ-పాస్’ కష్టాలు

- రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉంటేనే ఇళ్ల నిర్మాణానికి అనుమతి
- ఇంటిపన్ను నిర్ధారణ, క్రయవిక్రయాలకూ అవకాశం లేదు
- భద్రాద్రి జిల్లాలో రెండేళ్లుగా నిలిచిపోయిన కార్యకలాపాలు
- ప్రత్యామ్నాయం చూపడంలో అధికారులు విఫలం

అశ్వారావుపేట, ఏప్రిల్ 3: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులతో పాటు ఇళ్ల క్రయవిక్రయాలు, ఇంటి పన్నుల నిర్ధారణ కోసం రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం తీసుకొచ్చిన ‘టీఎస్ ఈ-పాస్’ విధానం ఏజెన్సీ జిల్లాలకు తలనొప్పిగా మారింది. ఈ విధానంలో ఎవరైనా కొత్తగా ఇల్లు నిర్మించుకోవాలన్నా, కొనుగోలు, అమ్మకాలు చేయాలన్నా టీఎస్ ఈ-పాస్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలోనే స్థలం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, దాని పూర్వ రికార్డులు, దరఖాస్తుదారుని ఇతర వివరాలు తప్పనిసరిగా జతచేయాల్సి ఉంటుంది. అంతే కాకుండా ముందుగానే అనుమతుల ఫీజులు, ఇంటి పన్నులు, ప్రభుత్వం వేసే ఇతర రకాల సెస్సులు చెల్లిస్తేనే దరఖాస్తు స్వీకరిస్తుంది. ఈ విధానంతో పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. కానీ భద్రాద్రి కొత్తగూడెం లాంటి ఏజెన్సీ జిల్లాల వాసులకు మాత్రం కష్టాలు తెచ్చిపెట్టింది.

ఏజెన్సీ ప్రాంతాల్లో అమలు అసాధ్యం..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాలు ఉండగా మూడు మండలాలు పాక్షికంగా, మిగిలిన అన్ని మండలాలు పూర్తి ఏజెన్సీ ప్రాంతాలుగా ఉన్నాయి. అశ్వారావుపేట, పాల్వంచ, బూర్గంపహాడ్ మండలాల్లో కొంతభాగం మాత్రమే రిజిస్ట్రేషన్ ఏరియాగా ఉంది. ఆయా ప్రాంతాల్లోనూ అత్యధికశాతం గ్రామకంఠ్లం, ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ పట్టా భూములే అధికంగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏజెన్సీ ప్రాంతంలో టీఎస్ ఈ-పాస్ యాప్ ద్వారా ఇళ్లకు సంబంధించిన అనుమతులు పొందేందుకు అవకాశం లేదు. మైదాన ప్రాంతమైనా గ్రామ కంఠ్లం, ప్రభుత్వ భూముల్లో నిర్మించున్న ఇళ్లకు సరైన డాక్యుమెంట్లు ఉండవు. ఇలాంటి ప్రత్యేక పరిస్థితులతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టీఎస్ ఈ-పాస్ యాప్ విధానం అమలులోకి రాలేదు. దీంతో రెండేళ్లుగా జిల్లాలో ఇళ్ల నిర్మాణాల అనుమతులు, క్రయవిక్రయాలు, ఇంటి పన్నుల నిర్ధారణ, వసూళ్లు తదితర లావాదేవీలు పూర్తిగా నిలచిపోయాయి.

రిజిస్టర్ భూముల్లో నిర్మాణాలకే అనుమతులు

టీఎస్ ఈ-పాస్ యాప్ ద్వారా రిజిస్టర్డ్ భూముల్లో నిర్మాణాలు, కొనుగోళ్లు, అమ్మకాలకు మాత్రమే అవకాశం ఉంటుంది. కానీ భద్రాద్రి జిల్లా అత్యధికశాతం ఏజెన్సీ పరిధిలో ఉంటుంది. ఏజెన్సీలో గిరిజనేతరులకు పట్టాలుండవు. గిరిజనుల ఇళ్లు కూడా అధిక శాతం ప్రభుత్వ భూములు, అసైన్డ్‌భూముల్లోనే నిర్మించుకుంటారు. జిల్లాలో అశ్వారావుపేట, పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు వంటి పట్టణాల్లోనూ రిజిస్టర్డ్ భూములకన్నా ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలు, గ్రామ కంఠ్లం, ప్రభుత్వ స్థలాల్లోనే వేలాది ఇళ్లు ఉన్నాయి. గతంలో ఇలాంటి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటే పంచాయతీ అధికారులు దరఖాస్తులను పరిశీలించి స్థలం, ఇంటి కొలతలు తీసుకొని రికార్డుల్లో నమోదు చేసి నిర్మాణ అనుమతులు ఇచ్చేవారు. ఇంటిపన్ను వసూలు చేసేవారు.



గ్రామ పంచాయతీ కార్యాలయం (ఫైల్)

కానీ ప్రస్తుతం ఈ యాప్ ద్వారా ఆ అవకాశం లేకుండా పోయింది. దీంతో రెండేళ్లుగా కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నవారికి ఇంటి పన్నుల చెల్లింపు, పేర్లు మార్పిడికి అవకాశం లేకుండా పోయింది. తద్వారా ప్రజలకు ఇబ్బందులు ఎదురవ్వడమే కాకుండా పంచాయతీల ఆదాయంపైనా తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఏజెన్సీ జిల్లాల్లో నెలకొన్న ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, టీఎస్ ఈ-పాస్‌కు ప్రత్యామ్నాయం చూపాలని ఏజెన్సీవాసులు కోరుతున్నారు.

సమస్యలను ప్రభుత్వానికి నివేదించాం

సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి

టీఎస్ ఈ-పాస్ యాప్ ద్వారా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే ఇళ్ల నిర్మాణాలు, మ్యూటేషన్‌కు అవకాశం ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతాల్లోనూ ఈ యాప్ సరిగా పని చేయడంలేదు. చాలా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. సాంకేతిక సమస్యల వల్ల ఇళ్ల పన్నులు కూడా వసూలు చేయలేకపోతున్నాం. గత రెండేళ్లుగా జనన, మరణ ధ్రువపత్రాలు కూడా ఇవ్వలేకపోతున్నాం. ఆయా సమస్యలపై ప్రభుత్వానికి నివేదించాం.

ప్రత్యామ్నాయం ఏదీ..?

ఏజెన్సీ జిల్లాల్లో ప్రభుత్వ భూములు, గ్రామ కంఠ్లం భూముల్లో ఇళ్లు నిర్మించుకొని దశాబ్దాలుగా నివాసం ఉంటున్నవాటిని నిబంధనలపేరుతో ‘టీఎస్ ఈ-పాస్’ యాప్ అనుమతించడం లేదు. ప్రభుత్వ పట్టాలు జారీ చేసిన వాటిని కూడా ఈ యాప్‌లో పరిగణనలోకి తీసుకోవడం లేదు. దాంతో రెండేళ్లుగా పంచాయతీల్లో నిర్మాణ అనుమతులు, ఇతర లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ విధానం అమలులోకి తెచ్చి రెండేళ్లవుతున్నా దీని ద్వారా తలెత్తిన సమస్యలను పరిష్కరించడంతో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించారు. దాంతో లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలకు అనమతులు లేకుండాపోయాయి. ఆయా భవనాలకు విద్యుత్, నీటిసౌకర్యం కల్పించేందుకు యాతన పడాల్సి వస్తోంది. ఇక ఆయా భవనాలను కొనుగోలు చేసినవారు అవి తమ పేరున మారకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. లక్షల విలువైన ఆస్తులు లిటిగేషన్‌లో పడిపోయాయి.

పార్లమెంట్ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఈవీఎం మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో పినపాక 250, ఇల్లెందు 242, కొత్తగూడెం 253, అశ్వారావుపేట 184, భద్రాచలం 180, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1109 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అదనంగా ఈవీఎం కేటాయింపు ప్రక్రియ చేపట్టామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్లు ధారా ప్రసాద్, రంగ ప్రసాద్, ఎన్ఐసీ సుశీల్, ఎలక్షన్ సిబ్బంది నవీన్, వివిధ పార్టీల నాయకులు రాంబాబు, నేముల రమేష్, యెర్రా కామేష్, నాగేశ్వరరావు, లక్ష్మణ్ అగర్వాల్ తదితరులున్నారు.

కొత్తగూడెంలో ‘ఐఓట్‌ఫర్ ష్యూర్’ 5కే రన్

18 ఏళ్లు నిండిన వారంతా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో కొత్తగూడెంలో 5కే రన్ నిర్వహించారు. పోస్టాఫీస్ సెంటర్ నుంచి ప్రారంభమైన రన్ మార్కెట్‌యార్డు వరకు సాగింది. ఈ రన్‌ను కలెక్టర్‌తోపాటు ఎస్పీ రోహిత్‌రాజు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విద్యాచందన, ఏఆర్‌వో కాశయ్య, జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి పరందామరెడ్డి, జడ్పీ సీఈవో ప్రసూనారాణి తదితరులు పాల్గొన్నారు.



5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్ రాజు

కోర్టు సమస్యలు పరిష్కరించాలని వినతి

దమ్మపేట, ఏప్రిల్3: దమ్మపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం జిల్లా జడ్జి వసంతపాటిల్‌కు దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం కోర్టు ఛాంబర్‌లో బుధవారం జడ్జిని బార్ అసోసియోషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం సతీష్, లక్కినేని నరేంద్రబాబు, గొంది మురళీమోహన్, తిరునాటి సంజయ్, ముప్పిడి శ్యాంసుధాకర్, దర్గావలి, తుమ్మా రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జడ్జి వసంతపాటిల్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి



లకావత్ కిషన్

కామేపల్లి, ఏప్రిల్3: కామేపల్లి మండల పరిధిలోని గోవింద్రాలలో రేషన్ డీలర్ లకావత్ కిషన్(40) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృత దేహాన్ని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా నాయకులు ఏపూరి మహేందర్, గింజల నర్సింహ రెడ్డి, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, సొసైటీ చైర్మన్ గుజ్జర్లపుడి రాంబాబు, డి.సత్యనారాయణ, రామకృష్ణ, బావ్ సింగ్, డీలర్లు రవి, కుమార్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ గుత్తా వెంకటేశ్వరరావు..



వెంకటేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వేంసూరు, ఏప్రిల్3: వేంసూరు మండలం లచ్చన్నగూడెం మాజీ సర్పంచ్ గుత్తా వెంకటేశ్వరరావు(65) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బండి గురునాథరెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, కేశవరెడ్డి, పగుట్ల వెంకటేశ్వరరావు, రాచూరి గంగరాజు, మామిళ్లపల్లి వెంకటేశ్వరరావు, ఎండీ.ఫైజుద్దీన్ తదితరులు వెంకటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మద్యం స్వాధీనం

దమ్మపేట, ఏప్రిల్ 3: దమ్మపేట సమీపంలోని నెమిలిపేట గ్రామంలోని బెల్ట్‌షాపులో మద్యం నిల్వ చేశారన్న సమాచారం మేరకు బుధవారం ఎఫ్ఎస్‌టీం అధికారి కృష్ణ, ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.36,264 ఉంటుందని తెలిపారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



జిలుగుమాడులో పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

మధిరరూరల్, ఏప్రిల్ 3: మధిర మండలం నక్కలగరుబు ఏటి నుంచి ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను జిలుగుమాడు సమీపంలో టౌన్ ఎస్ఐ సంధ్య బుధవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నేలకొండపల్లి: ముదిగొండ మండలంలోని పెద్దమండవ గ్రాశివారులో గల ఏరులో దొంగతనంగా ఇసుకను లోడు చేసి తరలిస్తున్న 3 ఇసుక ట్రాక్టర్లను బుధవారం నేలకొండపల్లి పోలీసులు గువ్వలగూడెం వద్ద పట్టుకున్నారు. ట్రాక్టర్ల యాజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి, 3 ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

దమ్మపేట: రెడ్యాలపాడు గ్రామ పరిదిలోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో దమ్మపేటకు తరిలిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

చింతకాని: మండల పరిధిలోని మత్కేపల్లి నామవరం క్రాస్ రోడ్డు వద్ద ముదిగొండ మండలం గంధసిరి మున్నేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 3: మండలంలోని దబ్బతోగు గ్రామానికి చెందిన మడకం గంగరాజు(28) మంగళవారం కుటుంబసభ్యులతో ఘర్షణపడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బుధవారం కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

రూ.1.52 కోట్లకు ఐపీ

భద్రాచలం, ఏప్రిల్ 3: భద్రాచలానికి చెందిన వ్యాపారి వనమా సుబ్బారావు రూ.1.52 కోట్లకు కొత్తగూడెం న్యాయస్థానంలో భద్రాచలానికి చెందిన 45 మంది పేర్లను జత చేస్తూ దివాల పిటిషన్ దాఖలు చేశారు. ఐపీ నెం.6/2024 ద్వారా పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించినట్లు న్యాయవాది ముత్యాల రామచంద్రయ్య తెలిపారు.

తనిఖీల్లో రూ.లక్ష సీజ్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 3: ఎటువంటి ఆధారాలు లేకుండా ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్న రూ.లక్షను ఎన్నికల అధికారులు మండల పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డు వద్ద బుధవారం సీజ్ చేశారు. పెద్దతండా గ్రామానికి చెందిన గోపాల్‌రావు తన ద్విచక్రవాహనంపై పెద్దతండా నుంచి వెంకటగిరి వెళ్తూ తన వెంట రూ.లక్ష తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో వరంగల్‌క్రాస్ రోడ్డులోని ఎన్నికల చెక్ పోస్టు వద్ద ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా నగదు పట్టుబడ్డాయి. వాటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కామేపల్లి, ఏప్రిల్ 3: మద్యం తాగొద్దు అని భార్య మందలించడాన్ని తట్టుకోలేక భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలం సాతానుగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతానుగూడెం గ్రామానికి చెందిన నల్లపాటి రామనాథం(55) మద్యానికి బానిస కావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు వారం క్రితం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఔషధ కంపెనీపై కేసు



తనిఖీలు చేస్తున్న అధికారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్3: తప్పుడు ప్రకటనలు ముద్రించిన ఔషద కంపెనీపై ఔషద నియంత్రణ అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. పాల్వంచ పట్టణంలోని ఓ హోమియోపతిక్ స్టోర్స్‌లో తనిఖీల్లో భాగంగా పెవో గో సిరప్ అనే హోమియోపతి మందు ఔషదాలు, మేజిక్ నివారణలు, అభ్యంతకర ప్రకటనలపై ఎల్‌డిడి బయోసైన్స్ ప్రైవేటు లిమిటెడ్, హర్యానాపై కేసు నమోదు చేసినట్లు ఔషద నియంత్రణ అధికారులు ప్రసాద్, సంపత్‌కుమార్‌లు బుధవారం తెలిపారు. ఇట్టి మందులపై టైఫాయిడ్ జ్వరాన్ని నివారిస్తుందని తప్పుడు ప్రకటనను, వాటి లేబుల్‌పైన ముద్రించడం గమనించినట్లు పేర్కొన్నారు.

ఇల్లెందు ఓసీ సమీపంలో మంటలు

ఇల్లెందు టౌన్, ఏప్రిల్3: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే 5 ఓసీ సమీపంలో బుధవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి ఓసీ క్వారీ సమీపంలోని పైభాగంలో చెత్తా చెదారం పెద్ద ఎత్తున ఉంటడంతో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకోచ్చారు. మంటలు ఆకస్మాత్తుగా చెలరేగడంతో సమీప ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



ఓసీ సమీపంలో ఎగిసి పడుతున్న మంటలు

ఆగని మరణ మృదంగం

- అవగాహన లేమి, పోషకాహార లోపమే కారణం
- ఆరేళ్లలో 57మంది తల్లులు,1,227మంది శిశువులు
- గిరిజనుల్లో బాల్య వివాహాలూ కారణమే

భద్రాచలం, ఏప్రిల్ 3: భద్రాద్రి ఏజెన్సీలో మాతా శిశు మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలోనే అతిపెద్ద ఏజెన్సీ జిల్లాగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెంలో మాతాశిశు మరణాలు కొనసాగుతుండడం అధికారులను కలవరపెడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతా శిశు మరణాలను అదుపు చేసేందుకు వైద్య, ఆరోగ్య, స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నా.. తరచూ మాతాశిశు మరణాలు ఆగడంలేదు. దీనికి పోషకాహారలోపం బాల్యవివాహాలు, అవగాహనలోపమే కారణమని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా పోషకాహార లోపమే ఈ పరిస్థితికి కారణమని వారు స్పష్టం చేస్తున్నారు. గడిచిన ఆరేళ్లలో జిల్లాలో 57 మాతా, 1,227 శిశుమరణాలు సంభవించాయి. గతంతో పోలిస్తే మాతృ మరణాలు కొంచెం తగ్గినా.. శిశు మరణాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.



పోషకాహార పునరావాస కేంద్రంలో చికిత్స పొందుతున్న చిన్నారులు

గత ఆరేళ్లలో పరిస్థితి ఇలా..

సంవత్సరం	మాతృ మరణాలు	శిశు మరణాలు
2018-19	12	139
2019-20	15	327
2020-21	07	114
2021-22	07	250
2022-23	11	214
2023-24	03	183

మరణాలకు కారణాలివే..

ఏజెన్సీలో మాతాశిశు మరణాలకు ప్రధాన కారణం బాల్యవివాహాలు చేయడం, పోషకాహారలోపం, ఎనీమియా, కాన్పు కాన్పునకు మధ్య వ్యవధి లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఉన్న పోషకాహార పునరావాస కేంద్రంలో పరిశీలిస్తే గతంలో ఏడాదికి 180నుంచి 200మంది పోషకాహార లోపంతో బాధపడుతున్న శిశువులు రాగా ఇటీవల కాలంలో ఆ సంఖ్య సుమారు 300వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే ఇందులో మన రాష్ట్రంతోపాటు సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి కూడా శిశువులు వస్తున్నట్లు వైద్యసిబ్బంది పేర్కొంటున్నారు.

మాతృ మరణాలు తగ్గినా..

గతంతో పోలిస్తే ఏజెన్సీ ప్రాంతంలో మాతృ మరణాలు కొద్ది మేరకు తగ్గినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. శిశు మరణాలు గత ఆరేళ్లలో 1,227 జరగడం బాధాకరం. దీన్ని అధిగమించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏజెన్సీ ప్రాంతంలో మహిళలు, గర్భిణులకు అవగాహన కల్పించేందుకు కళాజాతాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది. అలాగే వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఏజెన్సీలోని వారికి అవగాహన కల్పిస్తే మాతా శిశు మరణాలను మరింతగా తగ్గించేందుకు వీలుంటుంది.

ఇంకా ఎదురుచూపే..

- ఎటూ తేలని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి వ్యవహారం
- 9వ తేదీ వరకు ప్రకటించే అవకాశం

ఖమ్మం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో హాట్ సీటుగా ఉన్న ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వ్యవహారం ఎటూ తేలడం లేదు. ఈ సీటు కోసం పార్టీలోని హేమాహేమీలు పోటీ పడుతుండడంతో అధిష్ఠానం నిర్ణయం తీసుకోలేకపోతోంది. గత కొద్ది రోజులుగా ఈ సీటుకోసం రోజుకొక కొత్త పేరు తెరపైకి వస్తున్నా చివరికి టికెట్ ఎవరి చేతికి చిక్కుతుందోనని ఖమ్మం జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. రాహుల్‌గాంధీ వయనాడ్‌లో నామినేషన్‌కు వెళ్లడంతో ఆయన ఢిల్లీ వచ్చిన తర్వాతే పార్టీ నేతలతో చర్చించి సర్వేల ఆధారంగా టికెట్ ఖరారు చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఖమ్మం టికెట్ విషయంలో పీసీసీ, ఏఐసీసీ ఎటూ తేల్చుకోలేక సతమతమవుతోంది. ఇతర నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక చకచకా సాగినా ఖమ్మం విషయంలో మాత్రం ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ‘వేలుకేస్తే కాలుకి.. కాలుకేసే వేలుకి’ అన్నట్లు ఆశావహులు ఎవరికి వారు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండడంతో అధిష్ఠానం ఎటూ తేల్చలేకపోతోంది.

జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల బంధుగణం టికెట్ బరిలో ఉండడంతో అభ్యర్థి ఎంపిక పరీక్షగా మారింది. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరావు తనయుడు యుగంధర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని టికెట్ ప్రయత్నాలు ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇటీవల పొంగులేటి శ్రీనివాసరెడ్డి బంధువు రఘురామిరెడ్డి పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. అయితే మంత్రుల బంధువులకు టికెట్లు నో చెబితే ఖమ్మం జిల్లాలో ఇతర ఆశావహులకు అవకాశం దక్కే చాన్స్ ఉంది. జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరావు, రాష్ట్ర గ్రానైట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కొత్తగూడేనికి చెందిన నాగ సీతారాములు టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే రాహుల్‌గాంధీ వచ్చిన తర్వాత ఖమ్మం టికెట్‌పై ప్రకటన ఉంటుందని, ఈనెల 9వ తేదీ వరకు టికెట్ ఖరారయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

అన్నకు అంత్యక్రియలు చేసిన చెల్లెళ్లు



అన్నకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న చెల్లెళ్లు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్3: అనారోగ్యంతో మృతిచెందిన 85ఏళ్ల అన్నకు చెల్లెళ్లు అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామంలో జరిగింది. కిష్టాపురం గ్రామానికి చెందిన జల్లి ముత్యాలు (85)కు భార్య, పిల్లలు లేరు. అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించే వారు లేకపోవడంతో సొంత సామాజికవర్గం పెద్దలు, గ్రామస్థులు కూడా ముందుకు రాకపోవడంతో ముత్యాలు చెల్లెళ్లు బుచ్చమ్మ, ఎల్లమ్మలు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఎల్లలు దాటిన బంధం

● తెలంగాణ అమ్మాయి..స్పెయిన్ అబ్బాయి

● సత్తుపల్లిలో వేదమంత్రాల సాక్షిగా ఒక్కటైన ప్రేమజంట

సత్తుపల్లి, ఏప్రిల్3: ఎల్లలు దాటిన వారి ప్రేమబంధానికి కుటుంబ సభ్యులు ఆశీర్వదించారు. స్పెయిన్‌కు చెందిన కుర్రోడితో తెలంగాణ అమ్మాయి ప్రేమలో పడింది. పెద్దల్ని ఒప్పించి ఆ జంట బుధవారం రాత్రి పెళ్లి చేసుకున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణానికి చెందిన విద్యాభారతి కళాశాల నిర్వాహకులు మందడపు సత్యనారాయణ, సుజని దంపతుల కుమార్తె లావణ్య స్పెయిన్ దేశంలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ అవిన్‌గూడ, బార్సిలోనా 169వాస్తవులు మారియానో మన్‌సిల్లా, ఎమిలియా దంపతుల జ్యేష్ఠ పుత్రుడు మార్క్ మన్‌సిల్లాతో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత ఇద్దరు ప్రేమించుకుని పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఇరు కుటుంబాల పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. హిందూ వివాహ సంప్రదాయ పద్ధతిలో మూడు ముళ్లబంధంతో ఒక్కటయ్యారు.

● సత్తుపల్లిలో స్పెయిన్ దేశస్థుల హడావుడి

లావణ్య, మార్క్ మన్‌సిల్లా ప్రేమ వివాహంతో సత్తుపల్లిలో స్పెయిన్ దేశస్థులు హడావుడి చేశారు. పెళ్లికి హాజరైన స్పెయిన్ మహిళలు సంప్రదాయబద్ధంగా చీరలు.. మగవారు కుర్తా పైజామా వంటి సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. ఈ వేడుకకు బంధుమిత్రులు, స్థానికులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



స్పెయిన్ అబ్బాయి మార్క్ మన్‌సిల్లా, తెలంగాణ అమ్మాయి లావణ్య దంపతులను ఆశీర్వదిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి

సత్తుపల్లి, ఏప్రిల్3: పెండింగ్‌లోని నాలుగు డీఏలు మంజూరు చేయాలని, ఐదో డీఏ గడువు కూడా సమీపిస్తున్నా ప్రభుత్వానికి తమగోడు పట్టదా అని విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సత్తుపల్లి పట్టణంలోని జవహర్‌నగర్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వీ.చెంచురెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ కమీషన్ అనుమతితో డీఏలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని, వాటికి సత్వరమే పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. మార్చి నుంచి ఉద్యోగ విరమణలు ప్రారంభమాయ్యయని, వారికి రావాల్సిన బకాయిలు తక్షణమే అందజేయాలని కోరారు. కార్యక్రమంలో బద్రుద్దీన్, ఏఎస్.ప్రకాశరావు, బూరుగు దాసు, సాంబశివరెడ్డి, వాణీ, కమలకుమారి, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

- 15లోపు పనులు పూర్తి చేయాలి
- ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ గౌతమ్ సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్, స్ట్రాంగ్ రూమ్ వద్ద తహసీల్దార్‌కు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్ 3: పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని, ఈ పనులు ఏప్రిల్ 15 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ఆర్ అండ్ బి, పీఆర్, విద్యా, గిరిజన సంక్షేమ శాఖ, మునిసిపల్ శాఖల ఇంజనీర్లు, మండల విద్యాధికారులు,అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఎల్‌ఈడీ లైట్లు, గదికి కనీసం రెండు ఫ్యాన్ల ఏర్పాటు ఉండాలన్నారు. టాయిలెట్లు వాడుకలో ఉండి, రన్నింగ్ వాటర్ సదుపాయం ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం బయట వీధిలైట్ల ఏర్పాటు చేయాలన్నారు. పెయింటింగ్ అవసరమున్నచోట, తక్షణమే చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 23 నాటికి పాఠశాలలు సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందుబాటులో ఉండరని దీంతో ఏప్రిల్ 15 లోగానే పనులు పూర్తి అయ్యేలా పకడ్బందీ కార్యాచరణ చేయాలన్నారు. పాఠశాలల్లో కేవలం ఎన్నికల వసతులా కాకుండా శాశ్వత ప్రాతిపదికన సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, పీఆర్ ఎస్‌ఈ చంద్రమౌళి, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పి సీఈవో వినోద్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి, పీఆర్, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ, మునిసిపల్ శాఖల ఇంజనీర్లు, మండల విద్యాధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పటిష్ఠంగా అమలు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్

సత్తుపల్లి: పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ సూచించారు. బుధవారం సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, ఐదుమండలాల రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ అధికారులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. తమతమ విధులను నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. ప్రజలందరూ సీ-విజిల్, వోటర్ హెల్ప్‌లైన్ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.యోగీశ్వరరావుతో పాటు అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని కళాశాలలో అవగాహన సదస్సు

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రాంప్రసాద్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న విలువ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ రవీందర్, ఎంపీఓ రాజారావు, ఆర్ఐ ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి పోరాడింది బీఆర్ఎస్ మాత్రమే

- క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పనిచేస్తే భారీ మెజార్టీ
- ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వరరావు
- మరోసారి గెలిపించాలని పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా

తల్లాడ, ఏప్రిల్3: పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ అభివృద్ధి, సమస్యలపై పోరాడింది బీఆర్ఎస్ మాత్రమేనని, మరోసారి ఖమ్మం ఎంపీగా గెలిపించాలని ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారంరాత్రి తల్లాడలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో సొసైటీ ఛైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నామా మాట్లాడుతూ తెలంగాణ గొంతుకగా బీఆర్ఎస్ పార్టీని భావించి తన గెలుపుకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ నాయకులు తమకు తామే ఎంపీ అభ్యర్థిగా భావించి పనిచేస్తే భారీ మెజార్టీ వస్తుందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల హయాంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన నిల్చిందన్నారు. మాయమాటలతో ఒక్కసారి మాత్రమే ప్రజలు మోస పోతారు తప్ప ఇంకోసారి మోసపోబోరన్నారు. తక్కువ విస్తీర్ణంలో సాగుచేసిన యాసంగి పంటలకు కూడా సాగునీరివ్వలేని పరిస్థితి ఉండటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, సమర్థవంతమైన ప్రభుత్వం లేకపోతే ప్రజలకు ఇబ్బందులు ఉంటాయని దీన్ని దృష్టిలో పెట్టుకొని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నాయకత్వంలో సత్తుపల్లి నియోజకవర్గం నుంచి తనకు 32వేల మెజార్టీ వచ్చిందని తిరిగి మెజార్టీ పెంచేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గంలో గ్రామగ్రామానా సంక్షేమ పథకాలను ప్రచారం చేసి బీఆర్ఎస్‌కు మద్దతుగా ఓట్లు కూడగట్టాలన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జడ్పీటీసీ దిరిశాల ప్రమీల, బీఆర్ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, నాయకులు దిరిశాల దాసూరావు, నాయుడు శ్రీనివాసరావు, కేతినేని చలపతిరావు, కోడూరి వీరకృష్ణ, బద్దం కోటిరెడ్డి, శీలం కోటిరెడ్డి, మోదుగు ఆశీర్వాదం, ముచ్చా మురళీధర్‌రావు పాల్గొన్నారు.

మధిరలో సబ్‌కోర్టు కార్యకలాపాలు వెంటనే ప్రారంభించాలి


జిల్లా న్యాయమూర్తికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మధిర, ఏప్రిల్ 3: మధిరలో నూతనంగా మంజూరైన సబ్ కోర్టు కార్యకలాపాలను వెంటనే ప్రారంభించాలని జిల్లా న్యాయమూర్తి జగజ్జీవన్ కుమార్‌ను మధిర బార్ సభ్యులు కోరారు. బుధవారం మధిర బార్ సభ్యులు అధ్యక్షుడు బొజెడ్ల పుల్లారావు ఆధ్వర్యంలో ఖమ్మంలోని జిల్లా న్యాయమూర్తిని కలిశారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కొత్తగా మంజూరైన సబ్‌కోర్టును త్వరితగతిన ప్రారంభించి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు బోజెడ్ల పుల్లారావు, సభ్యులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, దిరిశాల జగన్‌మోహన్‌రావు, సీ గోపాల్, కట్టా పూర్ణచందర్‌రావు, మోహన్ దాస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాజీసర్పంచ్‌కు నామా పరామర్శ

చింతకాని, ఏప్రిల్3: మండల పరిధిలోని లచ్చగూడెం మాజీ సర్పంచ్ గురిజాల ఝాన్సీ డెంగ్యూ జ్వరంతో ఖమ్మంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆమెను ఎంపీ నామా నాగేశ్వరరావు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, జడ్పీటీసీ కిషోర్ పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఖమ్మంరూరల్, ఏప్రిల్3: ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. మండల పరిధిలోని ఎంవీపాలెం గ్రామంలో ఉపాధిహామీ పనిప్రదేశాలకు వెళ్లి ఆశా కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందజేశారు. ఎండ తీవ్రత నుండి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారితెలిపారు. ఏ మాత్రం నీరసంగా ఉన్నా అనారోగ్య పరిస్థితులు తలెత్తినా వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పారు.

అవినీతి రహితంగా విద్యుత్ ఉద్యోగులు పనిచేయాలి

- 1108 రాష్ట్ర కార్యదర్శి తక్కిళ్లపల్లి శేషగిరిరావు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 3: అవినీతి రహితంగా విద్యుత్ ఉద్యోగులు పని చేయాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం 1108 రాష్ట్ర కార్యదర్శి తక్కిళ్లపల్లి శేషగిరిరావు కోరారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం మేరకు విద్యుత్‌శాఖలోని ఉద్యోగులు 24గంటల నిరంతర విద్యుత్‌కు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. అయితే ఉద్యోగ ఖాళీల కారణంగా అనేక ఇబ్బందులు, పనిభారం కలుగుతుందని పేర్కొన్నారు. వెంటనే ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మోహన్‌రావు, హేమాంక్, జీఎల్ఎస్ రావు, జీవీఎస్ఎస్ శ్రీనివాసరావు, ఎస్ వెంకట్రావు, ఆర్ వెంకట్రావు, కిరీటాచారీ, సీతారామయ్య, రమేష్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ

కామేపల్లి,ఏప్రిల్3: రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కామేపల్లి మండల పరిధిలో కెప్టెన్ బంజర సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. రామక్రిష్ణపురానికి చెందిన బిక్షం పొలానికి బైక్‌పై వెళుతున్నాడు. కెప్టెన్ బంజర సమీపంలో హరిచ్చంద్రాపురానికి చెందిన నవీన్ ఎదురుగా వచ్చి బిక్షం బైక్‌ను ఢీకొనడంతో భిక్షానికి తీవ్రగాయాలు అయ్యాయి.

ఎస్ఎఫ్ఐ సభలను జయప్రదం చేయండి

మధిరరూరల్, ఏప్రిల్3: ఈనెల5వతేదీన జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు పొనుకుల సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం శ్రీనిధి కళాశాలలో బోడ వెంకట్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ మహాసభలో మాట్లాడారు. ఖమ్మంలో జరిగే జిల్లా మహాసభల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

230కేజీల గంజాయి దహనం



రఘునాథపాలెం, ఏప్రిల్ 3: ఇటీవల కాలంలో ఖమ్మం 1టౌన్, తల్లా, వైరా పోలీసుస్టేషన్‌ల్లో 13 గంజాయి కేసుల్లో మొత్తం 230 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండలం మంచుకొండలోని పోలీసు ఫైరింగ్ రెంజ్ ప్రాంతంలో గంజాయిని కాంటా పెట్టి కేసుల వారీగా గణాంకాలు లెక్కించి కాల్చి దహనం చేశారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేశ్‌కుమార్, ఏసీపీలు సాంబరాజు, మల్లయ్య, సీఐ స్వామి, శ్రీహరి పాల్గొన్నారు.

బీమా చెక్కుల అందజేత

కామేపల్లి,ఏప్రిల్3: మండల పరిధిలోని గోవింద్రాలకు చెందిన రైతు లకావత్ రాజు మృతి చెందగా పీఎం జీవనజ్యోతి కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును, పొన్నెకల్ గ్రామానికి చెందిన మహిళా రైతు బానోత్ శౌరి మృతి చెందగా ఆమె కుటుంబానికి మంజూరైన రూ.50వేల చెక్కును అందజేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ గుజ్జర్లపుడి రాంబాబు మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ శ్రీవాణి, సీఈఓ గాదే నాగయ్య పాల్గొన్నారు.

ప్రతీ పంటకు గిట్టుబాటు ధరలు

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 3: రైతులు పండించే ప్రతి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కలిపిస్తుందని ఏడీఏ విజయచంద్ర పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బీరోలు, ఏలువారిగూడెం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, ఏఈవోలు రమేష్, పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి అస్వస్థత

చింతకాని, ఏప్రిల్ 3: మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన ఉపాధికూలీ బోళ్ల శివరావమ్మ బుధవారం ఉదయం పనులకు వెళ్లి అస్వస్థతకు గురైంది. పని ప్రదేశంలోనే అస్వస్థతకు గురై కళ్లు తిరిగి పడిపోవడంతో కూలీలు స్థానిక గ్రామీణ వైద్యుని దగ్గరకు తీసుకెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

చైనా ఫ్యాక్టరీ ఎదుట కార్మికుల ఆందోళన

ముదిగొండ, ఏప్రిల్ 3: ముదిగొండలోని చైనా ఫ్యాక్టరీ ఎదుట బుధవారం కార్మికులు ఆందోళన చేశారు. కొన్ని సంవత్సరాలుగా పరిశ్రమలో పనిచేస్తున్న తమను ఇటీవల కాలంలో సరైన పని లేదని పక్కనపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలపాటు పరిశ్రమ నడవదంటూ మాయమాటలు చెప్పి తమను తీసివేశారని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు పరిశ్రమ మొదలుకాగా ఇతర ప్రాంతాల్లోని వ్యక్తులను తీసుకువచ్చి పరిశ్రమ నడిపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తమను విధుల్లో తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు నాగేశ్వరరావు, శ్రీకాంత్, ఉపేందర్ పాల్గొన్నారు.

'ఫ్యాక్టర్‌వై'తో శ్రీ చైతన్య కళాశాల ఒప్పందం

ఖమ్మంరూరల్, ఏప్రిల్3: మండల పరిధిలోని పొన్నేకల్లులోని శ్రీచైతన్య కళాశాలలో హైదరాబాద్‌లోని టాస్క్ ఆధ్వర్యంలో జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలకు చెందిన ఫ్యాక్టర్‌వైతో శ్రీ చైతన్య కళాశాల బుధవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపల్ పన్నాల కృష్ణమూర్తి ఈ వివరాలు వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలకు చెందిన ఫ్యాక్టర్‌వై శ్రీ చైతన్య కళాశాలలో ఐపీ క్వాలిటీ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక, డైరెక్టర్ శ్రీ విద్య, టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, ఫ్యాక్టర్ వై ప్రతినిధులు ఫిలిప్ అస్యూమ్స్, మార్కో మార్చిస్, కళాశాల సీఈఓ పుట్ట శ్రీనివాస్ రాజేశ్ పాల్గొన్నారు.

అవగాహనలేమితో సైబర్ క్రైమ్‌లు

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్ 3: మానవ నిర్లక్ష్యం, అవగాహన లేమి కారణంగా సైబర్ క్రైమ్‌లు జరుగుతున్నాయని ఏసీపీ ఆర్‌వి ఫణింద్ర అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమం నిర్వహించారు. పెరిగిన ఇంటర్నెట్ కార్యకలాపాలతో సైబర్ నేరాలు ప్రమాదం పెరుగుతుందన్నారు. సైబర్‌క్రైమ్ ఫిర్యాదుల్లో 60 శాతం ఆర్థిక మోసాలకు చెందినవన్నారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించటానికి సైబర్‌జాగృక్తా దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎస్సై విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

విజయ కళాశాలలో జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం



ఉత్తమ విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న దృశ్యం

కొణిజర్ల, ఏప్రిల్3: స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు పాటు జరిగే జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం, కల్చరల్‌మీట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జేఎన్‌టీయూహెచ్ ఎకడమిక్ అడిట్‌సెల్ డైరెక్టర్ ఎస్. తారకల్యాణి హాజరయ్యారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టెక్నికల్ ఫెస్ట్‌లు దోహదపడతాయన్నారు. అనంతరం కళాశాల ఛైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎన్నో కాంపీటేషన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని తెలిపారు. మొదటి రోజులో భాగంగా పీపీటీలు, క్విజ్, జామ్, డిబెట్, వివిధ రకాలైన ఈవెంట్స్‌ను నిర్వహించారు. విద్యార్థులకు అన్ని రకాల వసతులను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ పారుపల్లి విజయలక్ష్మీ, ప్రొఫెసర్‌గంటా రమేష్, నివాస్ పీసిఎస్ ఇన్ఫోసిస్ దినేష్, కళాశాల ప్రిన్సిపాల్ జాన్‌బాబు, వైస్‌ప్రిన్సిపాల్ చిన్నయ్య, డీన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిత్రపక్షాలతో ముందుకు సాగండి

- బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు


ప్రసంగిస్తున్న వినోద్‌రావు

వైరా, ఏప్రిల్ 3: మే 13న జరిగే లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు మిత్రపక్షాలైన తెలుగుదేశం , జనసేన, ఎమ్మార్పీఎస్ ఇతర సంఘాలతో కలిసి ముందుకు సాగాలని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు పిలుపునిచ్చారు. వైరాలో బుధవారం జరిగిన బీజేపీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా వాసిగా ఇక్కడ సమస్యలు తెలిసిన వాడినని, అందువలన ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లా సత్యనారాయణ, భూక్యా శ్యామ్‌రాథోడ్, నున్నా రవి, పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, వైరా నియోజకవర్గ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు కొప్పూరి నాగేశ్వరరావు, చిలుకూరి రమేష్, చావా కిరణ్, బండారు నరేష్, రవిరాథోడ్, శ్రీకాంత్, రుక్మారావు, ఏపూరి శ్రీనివాసరావు, వెంకటకృష్ణ, ఏలే భద్రయ్య పాల్గొన్నారు.

బీజేపీగెలుపునకు ఐక్యంగా పనిచేయాలి

మధిర: జిల్లాలో బీజేపికి ప్రజల ఆదరణ ఉందని, దాన్ని ఓటుగా మరల్చుకొనేందుకు పార్టీ యంత్రాంగం కృషి చేయాలని తాండ్ర వినోద్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం మధిర రెడ్డి గార్డెన్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలూరు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, శ్రీకాంత్, చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్ పాల్గొన్నారు.

9 నుంచి అభయ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్3: ఖమ్మం యూపీహెచ్ కాలనీలోని శ్రీఅభయ వెంకటేశ్వర స్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల9 నుంచి ప్రారంభ మవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈనెల9న అంకురార్పణ, ధ్వజారోహణతో కార్యక్రమం ప్రారభమవుతుందన్నారు. 11న స్వామి వారి కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం, 13న మహాపుష్పాభిషేకం, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, కార్యదర్శి పురం తిరుపయ్య, కోశాధికారి బానోత్ మల్సూర్‌నాయక్, బొల్లి కొండల్ రావు, అల్లిక అంజయ్య, దండా జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బపై జాగ్రత్తలు తీసుకోవాలి

మధిరటౌన్, ఏప్రిల్3: మునిసిపల్ కార్మికులు వడదెబ్బకు లోనుకాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మధిర మునిసిపల్ కమిషనర్ షఫీఉల్లా కోరారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ప్రముఖ వైద్యులు మనోరమ వడదెబ్బకు గురి కాకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి

నేలకొండపల్లి ఏప్రిల్3:నేలకొండపల్లి బీజేపీ కార్యాలయంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కోటి హనుమంతరావు చత్రపతి శివాజీ మహారాజ్ చత్రపటానికి పూలమావేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు మన్నె కృష్ణారావు, పాగర్తి సుధాకర్, మోర్చా మండల అధ్యక్షుడు తొగిట్టి నాగాచారి, బాజారామకృష్ణ, కంది రామకృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఖమ్మంరూరల్, ఏప్రిల్3: వరంగల్‌క్రాస్ రోడ్డు విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ క్రాంతిసింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గుదిమళ్ల, వెంకటగిరి, తెల్దారుపల్లి, పోన్నేకల్లు, మద్దులపల్లి, తల్లంపాడు, ఏదులాపురం, గ్రామ పంచాయతీల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

పొన్నెకల్‌లో క్రికెట్ టోర్నమెంట్

కామేపల్లి, ఏప్రిల్3:మండల పరిధిలోని పొన్నెకల్ గ్రామంలో కామేపల్లి, కారేపల్లి, డోర్నకల్, గార్ల నాలుగు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రథమ బహుమతి రూ.15,116, ద్వితియ బహుమతి రూ.8,116 అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గింజల నర్సింహరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, ఏపూరి మహేందర్, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, దమ్మలపాటి సత్యనారాయణ, గుజ్జర్లపుడి రాంబాబు, అశోక్ నిర్వాహకులు గోపిక్రిష్ణ, రాజు, సునిల్, లింగరాజు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

మంత్రి సీతక్కని కలిసిన ముక్తి

ఏన్కూరు, ఏప్రిల్3: పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కను ములుగు క్యాంపు కార్యాలయంలో గురువారం రాయమాదారం మాజీ సర్పంచ్ ముక్తి లక్ష్మినారాయణ కలిశారు. మండలంలోని లింకురోడ్లు, గిరిజన, సమస్యలను వివరించారు.

టైలర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడిగా సత్య

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్3: సత్తుపల్లి పట్టణ టైలర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా సత్య టైలర్స్ అధినేత వీ.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. బుధవారం సత్తుపల్లిలోని కళాభారతిలో నిర్వహించిన ఎన్నికలలో సమీప ప్రత్యర్థి డీఎన్.చారిపై 105ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం ఉమామహేశ్వరరావుకు 196ఓట్లు రాగా డీఎన్.చారీకి 86ఓట్లు మాత్రమే వచ్చాయి. ఉమామహేశ్వరరావు టైలర్స్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు.

పాఠశాలపై చర్యలు తీసుకోండి

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్3: కవిరాజ్ నగర్‌లోని ఓ పాఠశాల మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంటగదుల ద్వారా వచ్చే దుర్వాసన కారణంగా అనారోగ్య పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానికులు రాంచందర్, టి ఉంపేదర్ ఈ వివరాలు వెల్లడించారు. కేవలం 137 గజాల్లో పాఠశాల ఉందని, విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలకు అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు.